అరగంట ముందుగానే చేరుకోవాలి

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నకలె క్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి

వనపర్తి, మార్చి 1: ఇంటర్ , పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులు నిర్దేశిత సమయానికి అరగంట మందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీసీ ద్వారా హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లతో ఇంటర్, పదో తరగతుల వార్షిక పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు. నిమిషం ఆలస్యం నిబంధనల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్న మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి పలు సూచనలు చేస్తూ విద్యార్థులు ఒకటి, రెండు నిమిషాలు ఆలస్యం అయినా విద్యార్థి సరైన కారణం చూపించగలిగితే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ ఎస్పీ రక్షితాకృష్ణమూర్తితో కలిసి విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్‌తోపాటుగా త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. పరీక్షల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదన్నారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఇం టర్ పరీక్షా కేంద్రాల వద్ద చీఫ్ సూపరింటెండెంట్లు పకడ్బందీగా నిఘా ఉంచాలని ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నా రు. ఇంటర్ ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాలను చీఫ్ సూపరింటెండెంట్ల సమక్షంలోనే క్లోజ్డ్ వాహనాల్లోనే తరలించాలని సూచించారు. ఇందుకోసం తాసీల్దార్లుతో కలిసి చీఫ్ సూపరింటెండెంట్లు సమన్వయం చేసుకోవాలన్నారు. తాసీల్దార్లుతో తమ పరిధిలోని పరీక్షా కేంద్రాలను విజిట్ చేయాలన్నారు. సమావేశంలో ఇంటర్ జిల్లా విద్యాధికారి మద్దిలేటి, జిల్లా విద్యాశాఖ నుంచి గణేశ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సహకరించాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల, మార్చి 1 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఉప ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పా టించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 4వ తేదీ నోటిఫికేషన్ విడుదల అవుతుందని, మార్చి11న నామినేషన్లకు తుది గడువు, 12న నామినేషన్ల పరిశీలన, 14న ఉపసంహరణకు తుదిగడువు ఉందన్నారు. మార్చి28 ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్, ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు ఉంటుందని, 4 తేదీన ఎన్నికల కోడ్ ముగుస్తుందని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాకు సంబంధించిన స్థానిక సంస్థల ఓటర్లకు పోలింగ్ స్టేషన్ గద్వాల జెడ్పీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమీక్షా సమావేశంలో అధికారులు వెంకటేశ్వర్లు, నరేశ్, సురేశ్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

ఎంపీపీని సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామన్‌గౌడ్

అయిజ, మార్చి 1 : మండల అభివృద్ధితో పాటు బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్ ఎంపీపీ ప్రహ్లదరెడ్డిని కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆయన ఎంపీపీ ని రామన్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలకనుగుణంగా ఎమ్మెల్యేలు విజయుడు, కృష్ణమోహన్‌రెడ్డిలతోపాటు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిల సూచనలతో పార్టీ కార్యాకలాపాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుందర్‌రాజు, మాజీ సర్పంచ్ నీలకంఠరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు రవిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 326 మంది గైర్హాజరు

వనపర్తి టౌన్, మార్చి 1 : జిల్లావ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ రెండో పరీక్షకు 326మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,780 మందికి గానూ 5,534 మంది హాజరు కాగా 246మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,152 మందికి గానూ 1,072 మంది హాజరు కాగా 80 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 6,932 మందికి గానూ 6,606మంది హాజరు కాగా 326 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి మద్దిలేటి తెలిపారు.

సాగునీటి కాల్వల్లో చెట్లు తొలగింపు

పెబ్బేరు, మార్చి 1 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండంలో పలు పనులు చేపట్టి 538మందికి ఉపాధి కల్పించినట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. శుక్రవారం కంచిరావుపల్లిలోని సాగునీటి కాల్వలో పేరుకపోయిన జమ్ము, మట్టి తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ వో అక్తరున్నీసా, సిబ్బంది మహేశ్, బాలస్వామి, బాలవెంకట్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

అమరచింత, మార్చి 1:మానవ మనుగడకు జీవనాధారమైన మొక్కలను సంరక్షించే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. మండలంలోని మస్తీపూర్, కృష్ణంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ముందుగా ఎన్ఆర్ఈజీఎస్ పనులను పరిశీలించి అనంతరం పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, దాస్‌లతో కలిసి ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారుల పక్కన ఉన్న మొక్కలకు నీరు పట్టారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తీర్మానం మేరకే సీసీ రోడ్డు పనులు చేపట్టాలి

పాన్‌గల్, మార్చి 1: గ్రామపంచాయతీల తీర్మానం మేరకే సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో మండలపరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని బుసిరెడ్డిపల్లి, దొండాయిపల్లి, వెంగళాయిపల్లి తదితర గ్రామాల్లో గ్రామపంచాయతీల తీర్మానం లేకుండా సీసీ రోడ్లు వేసేందుకు కాంగ్రెస్ చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారని, అలాంటి పనులు నిలుపుదల చేయాలని సంబంధిత అధికారులను ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం రూ.3.10 కోట్లు కేటాయించిందని తెలిపారు. గ్రామ పంచాయతీల తీర్మానం మేరకు ఈ నిధులతో పనులు చేపట్టాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో కోటేశ్వర్, ఎంపీవో రఘురాములు, వైస్ ఎంపీపీ కవిత, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, శ్యామల, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

కొంకలలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

వడ్డేపల్లి, మార్చి 1: మండలంలోని కొంకల గ్రామంలో శుక్రవారం పశువైద్యాధికారి పుష్పలత ఆధ్వర్యంలో ఆవులు, గేదెలు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ 27 మంది రైతులకు చెందిన 583 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ వరప్రసాద్, ఎల్ఎస్ఏ లతీఫ్, ఓఎస్ రవికిరణ్‌తది తరులుపా ల్గొన్నారు.

ఖిల్లాఘణపురంలో..

ఖిల్లాఘణపురం, మార్చి 1: మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో శుక్రవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో 264 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యుడు సుసాన్‌కెస్సి మాట్లాడుతూ సీజనల్‌లో సోకే గాలికుంటు వ్యాధులపై పశుకాపరులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్ సునీత

వనపర్తి టౌన్, మార్చి 1 : ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్ సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ నేతలతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. సివిల్ కేసులు, లిటికేషన్ కేసులు, చెక్ బౌన్స్ , బ్యాంకు సంబంధిత కేసులను పరిష్కారం చేయాలని ఆమె సూచించారు. అదేవిధంగా ఆత్మకూరు, ఇతర కోర్టు సముదాయాల పరిధిలోని కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలని తెలిపారు. ప్రమాద కేసులు, ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన కేసులు తదితన అంశాల్లో న్యాయవాదులు చొరవ తీసుకొని పరిష్కారం చేయాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌యాదవ్, భరత్‌కుమార్, భక్షి చంద్రశేఖర్, షాకీర్‌హుస్సేన్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

గోపాల్‌పేట, మార్చి 1 : రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యత, ఓటు హక్కు వినియోగించుకోకుంటే కలిగే నష్టాలు, వినియోగదారుల హక్కులు, బాధ్యతల పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాధిక దాములూరి, సుప్తా సర్కార్ కళాశాల విద్యార్థినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్ష

పెద్దమందడి, మార్చి 1: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలస్థాయి గణిత ప్రతిభ పరీక్షను నిర్వహించినట్లు జిల్లా కో–ఆర్డినేటర్ యుగంధర్ తెలిపారు. ఈ పరీక్షకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 5వ త రగతికి చెందిన 40మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ప్రథమ బహుమతి అల్వాల పాఠశాలకు చెందిన హరిణి రూ.1వెయ్యి, ద్వితీయ బహుమతి పి.గౌతమ్, జి.రాణి, జి.ప్రశాంత్‌లకు రూ.500, తృతీయ బహుమతి వెంకటేశ్‌కు రూ.400 నగదు బహుమతులను జిల్లా కో–ఆర్డినేటర్ యుగంధర్ అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎంలు మంజులత, గోపినాథ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అమరులకు ఘన నివాళి

గద్వాల అర్బన్, మార్చి 1 : ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత హక్కుల సాధన కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకుడు కురుమన్న శుక్రవారం నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొని మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ రామేశ్వరమ్మతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణకు కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిన కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేశ్, సంధ్యా అశోక్, మోషే, కన్న, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలు సాధించిన గృహిణి

గోపాల్‌పేట, మార్చి 1 : భర్త ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారంతో మండలంలోని పాల్కెపహాడ్ గ్రామానికి చెందిన గృహిణి శ్వేత ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. గద్వాల జిల్లా మానవపాడు మం డలం జల్లాపురం గ్రామానికి చెందిన సరస్వతి నరసప్పనాయుడు కుమార్తె శ్వేతకు పాల్కెపహాడ్ గ్రామానికి చెందిన శివకుమార్‌తో వివాహం చేశారు. వివాహమైనా చదువుపై మక్కువ ఉండటంతో భర్త, తల్లిదండ్రుల సహకారంతో పోటీ పరీక్షలకు సిద్ధమైంది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలు సాధించింది. ఈమె గురుకుల జూనియర్ లెక్చరర్ (జేఎల్)పోస్టు ఎంపిక చేసుకున్నది. గ్రామస్తులు అభినందించారు.

అలంపూర్ యువకుడు..

అలంపూర్, మార్చి 1 : మండలంలోని భీమవరానికి చెందిన కృష్ణమ్మ,రవీందర్‌రెడ్డిల కుమారుడు శ్రీనివాసరెడ్డి ఒకే సారి మూడు ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం రైల్వే శాఖలో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాసరెడ్డి ఇటీవల విడుదలైన ఫలితాల్లో జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని తోటి మిత్రులు బోయ అదాకర్ నాయుడు, గ్రామస్తులు అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

గద్వాల అర్బన్, మార్చి 1 : పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, గద్వాల రూరల్ పోలీసులు దాడిచేసిన ఘటన గద్వాల మండలంలో శుక్రవారం చోటు చేసుకున్నది. గద్వాల రూరల్ ఎస్సై పర్వతాలు కథనం ప్రకారం ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు మండలంలోని శెట్టి ఆత్మకూర్ గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట అడుతున్నట్లు విశ్వశనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులతోపాటు గద్వాల రూరల్ పోలీసులు దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఐదుగురిని పట్టుకోగా 16మంది పరారైనట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 9 బైక్‌లు, రెండు మొబైల్ ఫోన్లు, రూ.1,14,580నగదుతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా తిక్కవీరేశ్వరస్వామి రథోత్సవం

- అధిక సంఖ్యలో తరలొచ్చిన భక్తులు
- జన సంద్రంగా మారిన ఆలయ ప్రాంగణం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అయిజ, మార్చి 1 : పట్టణంలో వెలసిన తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన రథోత్సవంపై స్వామివారి ఉత్సహ విగ్రహాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల శివ నాస్మరణ, పటాకుల మోత, నందికోళ్లసేవ, భాజా భజంత్రీల మధ్య రథోత్సవం నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అశేషంగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం జన సంద్రంగా మారింది. ఉదయం అర్చకులు స్వామివారికి పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకుముందు కుంభం కాగును భాజా భజంత్రీల మధ్య ఆలయానికి చేర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అయిజ, రాజోళి, మానవపాడు ఎస్సైల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, తిక్కవీరేశ్వర స్వామి యూత్, రైతు సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సందెరాళ్ల పోటీలు

తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన అంతరాష్ట్ర సందెరాళ్లు, దొబ్బుడు గుండ్లు, ఇసుక సంచుల ఎత్తుపోటీలు ఆకట్టుకున్నాయి. పోటీలకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన బలభీములు తరలొచ్చారు. దొబ్బుడుగుండు ఎత్తు పోటీలో మొదటి బహుమతి వెంకటాపురం లాల్‌భాషా, రెండో బహుమతి షాపూర్ పకీరప్ప, మూడో బహుమతి వెంకటాపూర్ షబ్బీర్ గెలుపొందారు. ఇసుక సంచి ఎత్తు పోటీలో కర్ణాటకకు చెందిన మరియప్ప మొదటి బహుమతి, దేవదుర్గ పరుశరాముడు రెండోవ, దేవదుర్గ సాబన్న మూడో బహుమతి, సందెరాళ్లు ఎత్తు పోటీలో మొదటి బహుమతి మిట్టదొడ్డి ఉరుకుందు, రెండో బహుమతి మల్లెబాద్‌కు చెందిన నిజాం, మూడో బహుమతి మేడికొండ రాజు గెలుపొందారు. విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. శనివారం అంతరాష్ట్ర ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్, భజన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కనకదుర్గ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పూజలు చేస్తున్న కమాండెంట్ సాంబయ్య దంపతులు

ఎర్రవల్లి చౌరస్తా, మార్చి 1:ఎర్రవల్లి మండలంలోని పదోపటాలంలోని కనక దుర్గ అమ్మవారి ఆలయం వద్ద కమాండెంట్ సాంబయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ముందుగా కమాండెంట్ పదోపటాలం సిబ్బందితో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు సాంబశివరావు, నాగభూషణం, రషీద్, ఆర్ఐలు రాజారావు, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీధర్ పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

కల్యాణోత్సవంలో పాల్గొన్న శివస్వాములు

మల్దకల్, మార్చి 1 : మండలంలోని తాలికుంట గ్రామంలో శివస్వాములు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్నిగుండ మహోత్సవం

పాన్‌గల్, మార్చి 1: మండలంలోని కేతేపల్లి గ్రామంలో శుక్రవారం శివస్వాములు అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. అంతకుముందు రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అనిత, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి..

కొత్తకోట, మార్చి 1 : మండలంలోని పాలెం గ్రామంలో శుక్రవారం శివస్వాముల ఇరుముడి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా శివలింగానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి గణపతిహోమం చేశారు. అనంతరం శివస్వాములు శ్రీశైలానికి బయలు దేరారు.

శ్రీశైలానికి తరలిన స్వాములు

మల్దకల్, మార్చి 1 : మండలంలోని నీలిపల్లిలో శివస్వాములు ఇరుముడి కట్టుకొని శ్రీశైలానికి బయలుదేరారు.

ధరూరు నుంచి..

ధరూరు, మార్చి 1 : మండలంలోని నీలహళ్లి గ్రామంలోని శివస్వాములు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడిని నెత్తిన పెట్టుకుని శ్రీశైల మల్లన్న చెంతకు బయలుదేరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

రాజోళి నుంచి..

రాజోళి, మార్చి 1: మండల కేంద్రములోని శివస్వాములు గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని పాద యాత్రగా శ్రీశైలానికి తరలి వెళ్లారు.

రాజోళి నుంచి శ్రీశైలానికి వెళ్తున్నశి వస్వాములు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు

మదనాపురం, మార్చి 1 : మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలో అంగన్‌వాడీ–2 కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్ఠికాహారం తీసుకోవడం వలన పుట్టే పిల్లలు ఎలాంటి లోపం లేకుండా జన్మిస్తారని, చిన్నారులకు కూడా పౌష్టికాహారం అందించడంతో చురుకుగా ఉంటూ అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

పెబ్బేరు మండలంలో..

పెబ్బేరు, మార్చి 1: పెబ్బేరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్న పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మి పాల్గొన్నారు.



అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



పెబ్బేరు అంగన్‌వాడీ కేంద్రంలో..

ప్రాపర్టీ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- గద్వాల ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, మార్చి 1 : జిల్లా వ్యాప్తంగా ప్రాపర్టీ నేరాలు జరగకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ రితిరాజ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే స్టేషన్, పలు ప్రాంతాల్లో పెట్రోలింగ్, పోలీసింగ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రత్యేక షీటీమ్స్, రాత్రి సమయంలో ప్రత్యేక నిఘా తదితర విషయాల్లో పటిష్ట భద్రత ఉంటుందన్నారు. అలాగే గతంలో దొంగతనం కేసుల్లో పట్టుబడిన నిందితులను అదుపులోకి తీసుకోవడం, రాత్రి సమయంలో అనుమానాస్పదంగా కనిపించే వారిని ఫింగర్ ప్రింట్స్ తీసుకొని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా రాజావలీ దర్గా ఉర్సు

అమరచింత, మార్చి 1 : పట్టణంలో నాలుగు వందల ఏండ్ల కిందట వెలిసిన హజరత్ సయ్యద్‌షా రాజావలీ దర్గా ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా దర్గా కమిటీ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ మూడురోజులపాటు జరుగనున్న ఈ ఉత్సవాలకు శనివారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజ రై చాదర్ సమర్పిస్తారని తెలిపారు. ఆదివారం గంధోత్సవం నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామని ఉర్సు కమిటీ సభ్యులు తెలిపారు.

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

ఇటిక్యాల, మార్చి 1: మండలంలో ఆదివారం నుంచి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల వైద్యాధికారి విష్ణు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో ఐదేండ్ల లోపు చిన్నారులు 5,052 మంది ఉన్నారని వారందరికీ పోలియో చుక్కలు వేసేందుకు నాలుగు రూట్లలో ఒక మొబైల్ టీం, అలాగే 44బూత్‌లల్లో పోలియో చుక్కలను వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు గానూ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు,అంగన్‌వాడీలు, ఆశలు మొత్తం 174 మంది సిబ్బంది పాల్గొంటారన్నారు. ఆదివారం కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఎర్రవల్లి చౌరస్తాలో ప్రత్యేక టీం పోలియో చుక్కలు వేయనున్నారని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

వడ్డేపల్లి, మార్చి 1: మండలంలోని జూలేకల్ స్టేజిలోని బీసీ కాలనీలో చేపడ్తున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొంకల, ముండ్లదిన్నె, వెంకట్రామనగర్ తదితర గ్రామాల్లో పనులు ప్రారంభయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సామేలు, చిన్నస్వామి గౌడ్, వెంకట్రాములు, ఆంజనేయులు, జయశంకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం కృషితో ఎదగాలి

అలంపూర్,మార్చి 1 : స్వయం కృషితో చేతి వృత్తుల ఆధారంగా ఆర్థికంగా ఎదగ వచ్చని మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దేవమ్మ అన్నారు.శుక్రవారం రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో మహిళా సంఘాల సభ్యులకు చేతి వృత్తుల శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు చేతి వృత్తులపై శిక్షణ ఇవ్వడంతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు సుంకన్న, ధనుంజయ, రమేశ్‌బాబు, రాణి, లత, రాజేశ్వరి, ప్రశాంతి, మనీష, చిన్నమ్మతదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

పెద్దమందడి, మార్చి 1 : జిల్లా కేంద్రంలోని నాగవరం రెడ్డి సేవా సమితి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి కుల బంధువులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి శుక్రవారం ప్రకటనలో కోరారు. ఈ సమ్మేళనం ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని, పెద్ద మందడి మండలంలోని అన్ని గ్రామాల రెడ్డి బంధువులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాల్వల్లో సిల్ట్ తొలగింపు

కొత్తకోట, మార్చి1: మండలంలోని కనిమెట్ట, నిర్వేన్ గ్రామాల రైతులకు సాగునీరు అందించేందుకు కాల్వలో పేరుకుపోయిన సిల్ట్‌ను జేసీబీ ద్వారా తొలగించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి రైతు సంఘం నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి సమస్యను తీసుకెళ్లగా పెద్ద కాల్వలో పేరుకుపోయిన షిల్ట్‌ను శంకరసముద్రం రిజర్వాయర్ నుంచి తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, శ్రీనివాసులు, వెంకటన్న, ధర్మన్న, కొండన్న ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కేటీదొడ్డి, మార్చి 1 : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం తెల్లవారు జామున గద్వాల నుంచి రాయిచూర్‌కు వాహనంలో 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గద్వాల మండలానికి చెందిన కృష్ణ తరలిస్తుండగా మల్లాపురం తండా కుచినెర్ల గ్రామ శివారులో పట్టుకున్నారు. అనంతరం విచారించగా రేషన్ బియ్యం అని తేలడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు

కొత్తకోట, మార్చి 1 : మండలంలోని కనిమెట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు సరఫరా చేసే డీసీఎం డ్రైవర్ నారాయణపై శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం కనిమెట్ట గ్రామంలో రెండు అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు గుడ్లను సరఫరా చేస్తున్నారు. అయితే 30గుడ్లను ఆ గ్రామానికి చెందిన కిరాణ షాపు యాజమాని బండలయ్యగౌడ్‌కు డ్రైవర్ విక్రయించాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఆమె గుడ్లను పక్కదారి పట్టించినందుకు డ్రైవర్ నారాయణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.